క్లుప్తంగా

నాగిరెడ్డికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న జంకె వెంకటరెడ్డి

తర్లుపాడు: మీర్జాపేటకు చెందిన ఆదర్శ రైతు దేవిరెడ్డి నాగిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి నాగిరెడ్డి నివాసానికి వెళ్లి ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కుమారుడు సాయిని పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ బాషా పతిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ రమేష్‌రెడ్డి, నాయకులు సూరెడ్డి రామసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, శేషయ్య పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు



వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

త్రిపురాంతకం: మార్కాపురం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో త్రిపురాంతకం ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శని, ఆదివారాల్లో నాటుసారా స్థావరాలపై విస్తృత దాడులు పోలీసులు నిర్వహించారు. 50 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి 10 కేజీల బెల్లం, 7 సీసాల నాటుసారాను స్వాధీనం చేసుకొని, కేశినేనిపల్లె గ్రామానికి చెందిన మాండ్రగుర్తి ఆదిలక్ష్మి, లేళ్లపల్లి గ్రామానికి చెందిన అలుగుసాని పుల్లయ్య, దువ్వలి గ్రామానికి చెందిన మాండ్రగుర్తి తిరుపతయ్యలను అదుపులోకి తీసుకున్నట్లు డీటీఎఫ్ పోలీసులు బాలరంగయ్య, చంద్రశేఖర్ తెలిపారు.

గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించుకోండి

పెద్దారవీడు: జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకం ద్వారా ఏప్రిల్ 24వ తేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు గ్రామాల్లో ఇంటి వద్దనే వేస్తారని పెద్దారవీడు పశు వైద్యాధికారి డాక్టర్ బాలునాయక్ ప్రకటనలో ఆదివారం తెలిపారు. గేదెలకు టీకాలు వేయించుకోవడం వలన పాలు తగ్గుతాయి అనేది కేవలం అపోహ మాత్రమేనని, టీకాలు వేసే సిబ్బందికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నుల పంపిణీ

త్రిపురాంతకం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో త్రిపురాంతకం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి చదువుతున్న 500 మంది విద్యార్థులకు అట్టలు, పెన్నులు హెచ్ఎం రాజశేఖరరెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ గుడిపాటి మధుసూదనరావు, సెక్రటరీ పవన్‌కుమార్, ఐపీసీ ఆఫీసర్ కొండూరి హనుమంతరావు, అధ్యక్షుడు గుడిపాటి చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు సముద్రాల సుధాకర్‌రావు, యూత్ అధ్యక్షుడు సోమశేఖర్, ఉపాధ్యక్షులు అయప్పపవన్, అన్నా సాయి, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

16 వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

కొనకనమిట్ల: మండలంలోని పలు గ్రామాల సచివాలయాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ అన్నారు. అర్హులైన వారు ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తమ బయోడేటాతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గొట్లగట్టు పరిధిలో క్లస్టర్ 8 బీసీ ఏ, క్లస్టర్ 9 ఎస్సీ, 11 ఎస్సీ, 14 ఎస్సీ, 15 బీసీ (బి), 20 ఎస్సీ, చినారికట్ల క్లస్టర్ 14 ఓసీ, గరిమినపెంట క్లస్టర్ 24 ఓసీ ఉమెన్, కాట్రగుంట క్లస్టర్ 16 ఎస్సీ ఉమెన్, నాగరాజుకుంట క్లస్టర్ 3 బీసీ, పెదారికట్ల క్లస్టర్ 4 ఓసీ, ఎదురాళ్లపాడు క్లస్టర్ 10 ఎస్సీ ఉమెన్, క్లస్టర్ 14 బీసీ, రేగుమానిపల్లి క్లస్టర్ 8 ఎస్టీ, నాగంపల్లి క్లస్టర్ 4 బీసీ, మునగపాడు క్లస్టర్ 5 ఎస్టీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.

కస్తూర్బాలో ప్రవేశాలు

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఆరు తరగతి, ఏడో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో 7, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 మందికి సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఏప్రిల్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సురేఖ అన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్, పేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సురేఖ సూచించారు. వివరాలకు.. 85007 23716 నంబరును సంప్రదించాలన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌తో మహిళలకు భద్రత



కరాటేలో శిక్షణ ఇస్తున్న కోచ్ రవి



మార్కాపురం: పోటీలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

- బ్లాక్ బెల్ట్ గ్రహీత లక్ష్మీ సామ్రాజ్యం

కొనకనమిట్ల: మహిళల భద్రత కోసం రుద్రమదేవి సెల్ఫ్ అకాడమీ సంస్థ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మహిళలకు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కరాటేలో మెళకువలు నేర్పించటం, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు అవసరమైన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ మేరకు రుద్రమదేవి సెల్ఫ్ అకాడమీ సంస్థ నిర్వాహకురాలు నర్రా లక్ష్మీసామ్రాజ్యం, అకాడమీ కోచ్ రవి, సునీత పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గొట్లగట్టు కేజీబీవీ బాలికల పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లక్ష్మీసామ్రాజ్యం బాలికలకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 400కు పైగా పాఠశాలలు, కాలేజీల్లో తమ సంస్థ తరఫున సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం షీ టీంలు ఏర్పాటు చేయటంతో వారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. షీ టీం మహిళలతో పాటు ప్రభుత్వ పాఠశాలల బాలికలకు మార్షల్ ఆర్ట్స్‌లో నైపుణ్యాలు నేర్పుతూ వారికి ఆత్మ రక్షణ కోసం ఉపయోగపడే మార్గాలను నేర్పిస్తామని చెప్పారు. సమాజానికి రక్షణ కలిపించే పనిలో మహిళలకు పోరాట కళలో రుద్రమదేవి సెల్ఫ్ అకాడమీ సంస్థ ద్వారా అవగాహన కలిపిస్తున్నామన్నారు. సమాజంలో నిత్యం జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలను చూసి మహిళలు భయపడకూడదన్నారు. ఇంట్లోనే ఉండిపోతే తమ కలల్ని నిజం చేసుకోలేరని చెప్పారు. అనంతరం పలు రకాల కరాటే విన్యాసాలను చూపించారు. జూన్, జూలై నెలల్లో అన్ని పాఠశాలల్లో విద్యార్థినులందరికీ ఆత్మరక్షణపై శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని కోచ్ రవి అన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

మార్కాపురం టౌన్: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్, బ్లాక్ బెల్ట్ టెస్టులను ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన త్రిపురాంతకం తహసీల్దార్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కరాటేతో ఆత్మవిశ్వాసంతో పాటు ఆత్మరక్షణ కూడా కలుగుతుందన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు కిషోర్, కరాటే చీఫ్ ఎగ్జామినర్ శ్రీనివాసరెడ్డి, తోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు.



కరాటేలో మెళకువలు నేర్పిస్తున్న సామ్రాజ్యం

భక్తి శ్రద్ధలతో శివ పార్వతుల కల్యాణం



తాళ్లూరు: అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు



బేస్తవారిపేట: ప్రత్యేక అలంకరణలో కోటా సత్యమాంబదేవి

మార్కాపురం టౌన్: ఉగాది సందర్భంగా నిర్వహిస్తున్న వసంత నవరాత్రా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని శ్రీ షిర్డీ సాయి బాబా మందిరం ఆవరణలో ఉన్న శ్రీ పార్వతి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి అమ్మవార్ల విగ్రహాలను ప్రత్యేకంగా వేదికపై ప్రతిష్ఠించి పూలమాలలతో అలంకరించి, అర్చకులు రవిశంకర్ శర్మ, భక్తుల శివనామస్మరణ మధ్య కళ్యాణక్రతువును నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వై. ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కళ్యాణోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌లకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి అభిషేకార్చనలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. మందిర అధ్యక్షుడు జి. హరిహరరావు, కృష్ణమోహన్, కోశాధికారి నాగరాజు, రమణారెడ్డి, శ్రీను, సతీష్, బాలాజీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్రనామ, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

గుంటి గంగా భవాని అమ్మవారికి విశేష పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. రూ. 3,818 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



తాళ్లూరు: పూజలు చేస్తున్న భక్తులు



మార్కాపురం: శివపార్వతుల కళ్యాణం

రుద్రసముద్రంలో గ్రామ దేవతల ప్రతిష్ఠ

దొనకొండ: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో గ్రామ దేవతల ప్రతిష్ఠ కార్యక్రమం రెండు రోజులగా జరుగుతోంది. ఆదివారం నాగమయ్య, గంగమ్మ, పోచమ్మ విగ్రహాలు ప్రతిష్ఠించారు. సోమవారం పోలేరమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ఠిస్తారు.

1045 మందికి కంటి పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

గిద్దలూరు రూరల్: మనోజ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సాయి టెక్నో స్కూల్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యశిబిరంలో గుంటూరు శంకర్‌రెడ్డి కంటి వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. 1045 మందికి పరీక్షలు నిర్వహించగా 735 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించి ప్రయాణ ఖర్చులు మొత్తం వైద్యశాల వారే భరిస్తారన్నారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి రాజన్న భోజనశాల ద్వారా భోజనాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు బంగారు శీనయ్య, కొమరోలు ఎంపీపీ కామూరి అమూల్య, అర్ధవీడు జెడ్పీటీసీ చెన్ను విజయ, గిద్దలూరు మాజీ ఎంపీపీ వంశీధర్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్‌డి రామక్రిష్ణ పాల్గొన్నారు.

గొట్లగట్టులో ఆధార్ కేంద్రం

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు గ్రామ సచివాలయంలో ఆదివారం నుంచి 29వ తేదీ వరకు ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ జనార్దన్ తెలిపారు. మూడు రోజులపాటు సెంటర్ పని చేస్తుందన్నారు. అవసరమైన వారు తమ ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు, ఆధార్ కార్డు అప్‌డేట్ చేసుకోవచ్చని తెలిపారు.

పోలీసు లాంఛనాలతో ఏఆర్ కానిస్టేబుల్ అంత్యక్రియలు



కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఎస్సై

కంభం: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని రావిపాడు గ్రామానికి చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ కె.బి. క్రిష్టారెడ్డి అంత్యక్రియలు ఎస్పీ ఆదేశాల మేరకు స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు, ఏఆర్ సిబ్బంది పాల్గొని పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. మట్టి ఖర్చుల కింద రూ. 30,000 నగదును కుటుంబ సభ్యులకు అందజేశారు. డిపార్టుమెంటు నుంచి రావాల్సినవి త్వరగా వచ్చే విధం చూస్తామని ఎస్పీ తెలిపినట్లు ఎస్సై కుటుంబ సభ్యులకు తెలిపారు.

తర్లుపాడు ఎస్సైగా సుధాకర్



సుధాకర్

తర్లుపాడు: తర్లుపాడు నూతన ఎస్సైగా సుధాకర్ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసే ముక్కంటి బదిలిపై విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగానికి వెళ్లారు. సుధాకర్ పుల్లలచెరువు ఎస్సైగా పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఉన్నతాధికారుల సూచనలతో శాంతి భద్రతలను కాపాడతానని చెప్పారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వెద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి

- 1890 మందికి ఉచిత ఓపీ, ఈసీజీ, రక్త పరీక్షలు
- 12 మంది ప్రత్యేక వైద్య నిపుణుల హాజరు
- ప్రారంభించిన డీఎస్పీ నారాయణ స్వామి రెడ్డి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

దర్శి: స్థానిక పీజీఎన్ తాలూకా క్లబ్ సమావేశం హాలులో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. రోటరీ క్లబ్ అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ప్రముఖ హోమియో వైద్యులు షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, డాక్టర్ కృష్ణారెడ్డి, డాక్టర్ ఝాన్సీ కోటిరెడ్డి, ఇతర వైద్యుల సమక్షంలో నిర్వహించిన వైద్య శిబిరాన్ని డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి ప్రారంభించారు. మొత్తం 12 విభాగాల్లో ఓపీలు చూసేలా ఏర్పాట్లు చేశారు. ఆపరేషన్‌లు అవసరమైన వారందరికీ ప్రత్యేక శంకరకంటి వైద్యశాల వారి బస్‌లు ఏర్పాటు చేసి గుంటూరు తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేశారు. ఈసీజీ, రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సంఘ సేవకులు జీవీ రత్నం, రోటరీ క్లబ్ సెక్రటరీ రెడ్డి మాసు శ్రీనివాసరావు, ట్రెజరర్ కర్నా రమణారెడ్డి, వైద్యులు రవితేజ, సమీర్, కర్నా వెంకటేశ్వరరెడ్డి, రాహుల్, శ్రీనివాసరావు ,రమాలక్ష్మి, ఆవుల నవీన్‌రెడ్డి, బీవీ రమణారెడ్డి, కోట మాలకొండారెడ్డి, నాగమోణి, జహంగీర్ సుల్తాన్, ధీరజ్, నోయస్‌జాన్, జిన్నీ మాధ్యు, రోటరీ సభ్యులు నారాయణరెడ్డి, రాజారెడ్డి, భాస్కర్‌రెడ్డి, దుర్గారెడ్డి, మోహన్‌రావు, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



షెడ్‌ను పరిశీలిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

మార్కాపురం: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం దరిమడుగు ఎస్‌డబ్ల్యూపీసీని సందర్శించారు. క్లాప్ మిత్రలతో మాట్లాడుతూ తడి, పొడి, హానికర చెత్తలను వేరు చేయాలన్నారు. ఈఓఆర్డీ మోహన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం



ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న వాల్మీకి సంఘ నాయకులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: విద్యార్థులకు క్రమశిక్షణ అవసరమని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం కమల విద్యాసంస్థల విద్యార్థుల వీడ్కోలు సభ కరస్పాండెంట్, జిల్లా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పెనుగొండ పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టుదలతో కష్టపడి చదివితే ఉన్నత స్థానానికి వెళ్ల వచ్చన్నారు. 10వ తరగతి కీలకమైన దశ అని మంచి ర్యాంకులతో మార్కాపురానికి మంచి పేరు తేవాలని సూచించారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారం మరువలేనిదన్నారు. ఇంటర్మీడియెట్‌లో తీసుకునే సబ్జెక్ట్‌ను బట్టే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. పవన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. హెచ్ఎం పుల్లయ్య మాట్లాడుతూ భయం వీడి పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు.

వాల్మీకీలకు న్యాయం చేయండి

మార్కాపురం: రాష్ట్రంలో వాల్మీకి, బోయలకు ప్రభుత్వం అన్యాయం చేయవద్దని వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబొతుల కొండయ్య సంఘం నాయకులు ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి వినతి పత్రం ఇచ్చారు. ఈ నెల 24న అసెంబ్లీలో చేసిన తీర్మానం వల్ల వాల్మీకి, బోయలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కర్నూల్, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలోని వాల్మీకి, బోయలను ఎస్టీలగాను, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు, కృష్ణ జిల్లాలోని వాల్మీకి, బోయలను బీసీ–ఏలుగా గుర్తిస్తూ తీర్మానం చేసి కేంద్రానికి పంపారన్నారు. రాష్ట్రంలోని బోయ, వాల్మీకి లందరిని ఎస్టీలుగా పరిగణిస్తూ అసెంబ్లీలో బిల్ పాస్ చేసి కేంద్రానికి పంపాలని వినతి పత్రంలో కోరారు. న్యాయవాది భూపనికాశయ్య, యం. పోలయ్య, పీసీ వెంకటేశ్వర్లు, యం. రామాంజనేయులు, నాదగురు బ్రహ్మం, రవి, బొగెం కాటంరాజు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చలివేంద్రం

కంభం: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రావిపాడురోడ్డులో శిరిగిరి బ్రదర్స్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన కూలింగ్ చలివేంద్రాన్ని ఆదివారం స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఎస్సై మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ జాకీర్ హుస్సేన్, పులి శ్రీనివాస ప్రసాద్, బీవీ రామక్రిష్ణ, గోళ్ళ సుబ్బరత్నం, గంగాధర్, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకట్రావు పాల్గొన్నారు.

శివాలయానికి రూ. 1 లక్ష ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: మండలంలోని ఎర్రోబనపల్లి శివాలయానికి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఆదివారం లక్ష రూపాయలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ నగదును గ్రామ పెద్ద సుబ్బారెడ్డికి ఇచ్చారు. గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

అద్దంకి/అద్దంకి రూరల్: ఎదరెదురుగా రెండు బైకులు ఢీకొటంతో ఒకరికి గాయాలైన ఘటన ఆదివారం అద్దంకి పట్టణంలోని కలవకూరు వెళ్లే రోడ్డులో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం చెన్నుపల్లి గ్రామానికి చెందిన తంగిరాల గోపి బైక్‌పై కలవకూరు మీదుగా అద్దంకి వస్తున్నాడు. ఈక్రమంలో కలవకూరు రోడ్డులోని మలుపువద్ద ఎదురుగా వస్తున్న బైకును ఢీకొన్నాయి. గోపికి గాయలవటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

మోపెడ్, బైకుఢీ..

మరో ఘటనలో టీవీఎస్ మోపెడ్, బైకుఢీకొన్న ఘటన ఆదివారం అద్దంకి పట్టణంలో చోటుచేసుకుంది. అద్దంకిలోని రాజీవ్ కాలనికి చెందిన ఎస్కే మస్తాన్‌వలి టీవీఎస్ మోపెడ్ మీద రామ్‌నగర్ వైపు వస్తూ అదే రోడ్డులో ముందు వెళ్తున్న బైకును ఢీకొట్టాడు. దీంతో బైకు మీదనున్న కాంచనకు, టీవీఎస్ మోపేడ్ నడుపుతున్న మస్తాన్‌వలికి గాయలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108లో క్షతగాత్రులను అద్దంకి ప్రభుత్వ వైద్యాశాలకు తరలించారు. తలకు గాయాలైన కాంచనను మెరుగైన వైద్యం కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. మస్తాన్‌వలి అద్దంకి ప్రభుత్వ వైద్యాశాలలో చికిత్స పొందుతున్నాడు.

ఆర్టీసీ రాయితీలు సద్వినియోగం చేసుకోండి



పాస్ అందిస్తున్న డీఎం సుందరరావు

పొదిలి: ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో ప్రయాణికులకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ జె.సుందరరావు కోరారు. ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో దివ్యాంగులకు బస్‌పాస్‌ల మేళా నిర్వహించారు. మొత్తం 40 మంది దివ్యాంగులకు బస్ పాస్‌లను అందించినట్లు డీఎం చెప్పారు. ఏఎంటి ఎం.ధనలక్ష్మి, ఎస్‌టీఐ జి.ధనమ్మ, డీసీ ఆయిల్స్ పి.వి.సుబ్బయ్య, జాకబ్, ఆచారి, యూనియన్ ప్రతినిధులు రామకృష్ణ, అలీ, నారాయణ, కేవీ రావు, వేణుగోపాల్, సురేష్ పాల్గొన్నారు.

భూగర్భ జలాలపై రేపు అవగాహన సదస్సు

మార్కాపురం: భూగర్భజలాల వాడకంపై స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 28న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విద్యాసాగర్ తెలిపారు. నేషనల్ హైడ్రాలజీ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో భూగర్భ జలాల పరిస్థితి, వాడకం, వనరులపై సదస్సు ఉంటుందని తెలిపారు. రైతులు, ఎస్‌హెచ్ గ్రూప్ సభ్యులు హాజరు కావాలని కోరారు.